క్లుప్తంగా

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



మదిరేపల్లిలో సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ జేఈ శేషానందారెడ్డి

శింగనమల: ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు, పశువుల షెడ్లు నిర్మాణంలో నాణ్యత లేకుంటే చర్యలు తీసుకుంటామని క్వాటిటీ కంట్రోల్ జేఈ శేషానందారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చక్రాయిపేట, వెస్ట్ నరసాపురం, ఆకులేడు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయ ఇంజినీర్లతో వివరాలు తెలుసుకున్నారు. క్వాలిటీ పరంగా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఉపాధి హామీ ఇంజినీరు, సచివాలయ ఇంజినీర్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

కుష్టుకు ఉచితంగా మందులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ పారా మెడికల్ అధికారి ఓబులు

శింగనమల: కుష్టు వ్యాధికి ఉచితంగా మందులు అందజేస్తామని డిప్యూటీ పారా మెడికల్ అధికారి ఓబులు అన్నారు. గురువారం శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లెప్రసీ వ్యాధిపై అవగాహన కల్పించి, వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎవరికైనా రాగి రంగు గల మచ్చలు కనిపించినా, స్పర్శ లేని మచ్చలున్నా వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. మండల వైద్యాధికారి శంకర్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు రక్త హీనత లక్షణాలు కనిపిస్తే ఉచితంగా ఐరన్ మాత్రలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు అశ్వర్థ, నాగమ్మ, ఎఎన్ఎం శైలజ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


నిందితులను కఠినంగా శిక్షించాలి



ఎమ్మార్వో వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

గుత్తి: రాయచోటిలోని కొత్తపల్లి జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్‌ను దాడి చేసి కొట్టి చంపిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని గుత్తి ఎమ్మార్వో వద్ద గురువారం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు శ్రీనివాసులు, సూరి, బసవరాజు తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిని చంపడం దారుణమైన విషయమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.


ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక యూసీడబ్ల్యూఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దైవ సురేష్, జేసీడీఎం పాస్టర్ స్టీఫెన్ బెనిన్, జాన్ బెనిన్ తదితరులు కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. కార్యక్రమంలో సీఎస్ఐ పాస్టర్ దేవదానం, నాయకులు కేవీఎస్‌జే పాల్, ఆంథోని, పరిశుద్ధరావు, సామేలు, జానేకెనడీ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయపడిన శ్రీరాములు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో గురువారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని శ్రీరాములు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

శివారు కాలనీలో సమస్యల తిష్ట

- మౌలిక వసతులు లేక భీమ్‌రెడ్డి నగర్ వాసుల సతమతం
- ప్రమాదకరంగా జీబీసీ వంతెన
- పట్టించుకోని అధికారులు



భీమ్‌రెడ్డి నగర్ వెళ్లే రహదారి దుస్థితి



జీబీసీ వంతెనకు రక్షణ గోడలు లేని దృశ్యం

గుంతకల్లు: పట్టణ శివారులోని భీమ్‌రెడ్డినగర్‌వాసులు మౌలిక వసుతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన రోడ్డు వసతి లేకపోవడంతో రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీలు లేకపోవడంతో మురుగు రోడ్లపైనే ప్రవహిస్తోంది. అలాగే రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు నుంచి పాములు, తేళ్లు, ఇతరత్ర విషపురుగులు రోడ్డుపైన, ఇళ్లలోకి వస్తున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భీమ్‌రెడ్డి నగర్ కహానీ..

స్థానిక రాజేంద్రనగర్‌లో రైల్వే ఆక్రమిత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న దాదాపు 600 కుటుంబాలను 2003లో రైల్వే యాజమాన్యం ఖాళీ చేయించింది. దీంతో ఈ కుటుంబాలకు పట్టణ శివారులోని గుత్తి రోడ్డుకు దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ దూరంలో స్థలాలు కేటాయించి ఆర్డీటీ సహకారంతో ఇళ్లు కట్టించారు. ఈ కుటుంబాల్లోని అందరూ కూలి పనులు చేసుకుంటు జీవిస్తున్నారు. ఇక్కడ భీమ్‌రెడ్డి నగర్, గుజరీ కాలనీ, వినాయక కాలనీలు ఏర్పడ్డాయి. అంతేకాకుండా ఇటీవల ఉపాధ్యాయులు చాలా మంది అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకోవడంతో టీచర్స్ కాలనీ ఏర్పాటయింది. ఈ కాలనీలకు వెళ్లాలంటే గుత్తి రోడ్డు నుంచి కొంతదూరం వరకూ వచ్చిన తరువాత జీబీసీ (గుత్తి సబ్ బ్రాంచ్ కెనాల్) ఉంది. ఆ తరువాత ఈ కాలనీలకు రోడ్డు వసతి లేకపోవడంతో మట్టి రోడ్డులోనే రాకపోకలు సాగించాలి. ఇక వర్షం వస్తే .. బురదమయంగా మారి వాహనాదారులు, పాదచారుల పరిస్థితి ఘోరంగా ఉంటుంది. రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు పెరగడంతో రాత్రిళ్లు ఈ మార్గం గుండా వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. పాములు, తేళ్లు తదితర విషపురుగులు సంచరిస్తున్నాయని కాలనీవాసులు వాపోయారు. ఇళ్లలోకి పాములు వస్తుడటంతో బిక్కుబిక్కుమంటూ కాలం గడపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రమాదకరంగా జీబీసీ వంతెన

భీమ్‌రెడ్డి నగర్ ఎంట్రెన్స్‌లోనే జీబీసీ (గుత్తి సబ్ బ్రాంచ్ కెనాల్) కాలవ ప్రవహిస్తుంది. ఈ వంతెనకు రెండు వైపులా రక్షణ గోడలు దెబ్బతినడంతో ప్రమాదకంగా మారింది. గుత్తి రోడ్డు నుంచి వచ్చే వాహనాలకు కొంత దిగువ ప్రాంతం కావడంతో వేగంగా రావడానికి అవకాశం ఉంది. అయితే ఈ మార్గంలోనే ఉన్న జీబీసీ కాలవ వంతెన ఉంది. వంతెన రక్షణ గోడ సైడ్ వాల్స్ లేకపోవడంతో వాహనాలు కాలవలోకి పడిపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం కాలవలోకి తుంగభద్ర నీరు ఉధృతంగా ప్రవహిస్తుడంతో జరగరాని సంఘటనలు చోటు చేసుకుంటే ఎవరు బాధ్యత వహిస్తారని ఏరియా వాసులు ఆందోళన చెందుతున్నారు.

ఇళ్లలోకి పాములు వస్తాయన్నాయి



భీమ్‌రెడ్డి నగర్‌లో చివరలో ఉన్నాం. ఇళ్లకు అనుకొని కరివేపాకు తోటలు ఉన్నాయి. దీంతో పాములు బెడద ఎక్కుగా ఉంది. రాత్రి, పగలు తేడా లేకుండా వస్తున్నాయి. దీంతో తలుపు తీయాలంటే భయపడుతున్నాం. ఎప్పుడు ఏం జరుగుతుందో అని భయపడుతూ బతుకుతున్నాం.

– రంగమ్మ, భీమ్‌రెడ్డి నగర్

వర్షం వస్తే అంతే..



రోజూ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాం. పనికి వెళ్లాడానికి కాలనీ నుంచి గుత్తి రోడ్డు వరకూ నడుచుకుంటూ వెళ్లి, అక్కడ ఆటో ఎక్కి పని చేసే ప్రాంతాలకు చేరుకుంటాం. చిన్నపాటి వర్షం వచ్చినా బయటకు వెళ్లాంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– నీలమ్మ, భీమ్‌రెడ్డి నగర్

సీసీ రోడ్డు నిర్మించాలి



జీబీసీ నుంచి కాలనీ వరకూ సీసీ రోడ్డు వేయాలి. రోడ్డు వసతి సరిగా లేకపోవడంతో ద్విచక్రవాహనాంలో వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. అలాగే డ్రైనేజీలు ఏర్పాటు చేయడంతోపాటు రోడ్డుకు ఇరవువైపులా పెరిగిన ముళ్ల కంపలు తొలగించాలి.

– బోయ రామకృష్ణ, భీమ్‌రెడ్డి నగర్

అధికారులు దృష్టి సారించాలి



శివారు కాలనీలపై ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వీడాలి. సమస్యలపై పలుమార్లు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. సరైన రోడ్డు మార్గం లేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వర్షం వస్తే రాకపోకలు బంద్ అవుతావు. అధికారులు సీసీ రోడ్డు, డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. – చిన్నా, పట్టణ కార్యదర్శి, సీపీఎం (ఎంఎల్) న్యూడెమోక్రసీ

గృహాల నిర్మాణాలు పూర్తి చేసుకోండి

గుత్తి రూరల్: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో మంజూరైన గృహ నిర్మాణాలను లబ్ధిదారులకు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ సూచించారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గృహాలు మంజూరైనప్పటికీ నిర్మాణాలు ప్రారంభించని వారు, వివిధ దశలో ఉన్న లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు ఈ నెల 24 వరకూ గడువు ఉండేదన్నారు. అయితే గృహాల నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 2025 మార్చి 24 వరకూ గడువును పొడిగించిందన్నారు. మూడు విడతల్లో మంజూరైన గృహాలు ప్రస్తుతం ఏ దశలో ఉన్నా వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న కూలీలకు ఉపాధి హామీ నిధుల ద్వారా రూ.30 వేలు ఆర్థిక సాయం వచ్చేలా చూస్తామన్నారు.

నిందితుడి అరెస్టు

గుత్తి: మహిళపై హత్యాయత్నం చేసిన నిందితుడిని అరెస్టు చేశామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని కమాటం వీధికి చెందిన నజియా అనే మహిళపై డబ్బు తగాదా విషయంలో గత బుధవారం దాదా ఖలందర్ అనే వ్యక్తి కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ విచారణ చేశారు. ఈ క్రమంలో గురువారం నిందితుడు దాదా ఖలందర్‌ను అరెస్టు చేశారు. నిందితున్ని కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లలో ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన వివాహిత రమణమ్మ కుటుంబ కలహాల వల్ల గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉండగా వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'ఫసల్ యోజన' సద్వినియోగం చేసుకోండి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ మహితాకిరణ్

తాడిపత్రి రూరల్: ప్రధానమంత్రి ఫసల్ యోజన కింద ప్రీమియం చెల్లించి బీమా సౌకర్యం పొందాలని మంగళవారం వ్యవసాయాధికారి మహితా కిరణ్, ఇన్సూరెన్స్ కంపెనీ స్టేట్ ఇన్‌చార్జ్ అరుణ్ సూచించారు. మండలంలోని దిగువపల్లి, తేరన్నపల్లి గ్రామాల్లో గురువారం రైతులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబర్ 1వ నుంచి డిసెంబర్ 15 వరకూ సాగు చేసిన పంటలకు ప్రీమియం చెల్లించాలన్నారు. వ్యవసాయ పంటలకు 0.5 శాతం, ఉద్యాన పంటలకు 5.0 శాతం చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, కరువు, చీడపీడల వల్ల పంటకు కలిగే నష్టం నుంచి పరిహారం పొందవచ్చన్నారు. బ్యాంకుల ద్వారా గానీ, స్వయంగా ప్రీమియం చెల్లించాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా పంటలకు సంబంధించిన సర్టిఫికెట్‌ను తీసుకోవాలన్నారు. డిసెంబర్ 15లోపు ప్రీమియం చెల్లించాలన్నారు.

తుపాను బాధితులను ఆదుకోండి

పెంగల్ తుపాను వల్ల నష్టపోయిన బాధిత రైతులను ఆదుకోవాలని గురువారం వ్యవసాయాధికారి మహితాకిరణ్‌కు రైతు సంఘం నాయకుడు రాజారామిరెడ్డి వినతి పత్రం ఇచ్చారు. మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామంలో వందలాది ఎకరాల్లో కంది పంట, మునగ పంట దెబ్బతినిందన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



జిల్లా మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుత్తి: గుత్తిలో ఈ నెల 17,18న ఎస్ఎఫ్ఐ 32వ జిల్లా మహాసభలను నిర్వహించున్నామని విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, జిల్లా కార్యదర్శి, అధ్యక్షులు పరమేష్ సిద్ధు కోరారు. గుత్తిలో గురువారం వారు విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా , విద్యార్థి వ్యతిరేక విధానాలను మహాసభలో ఎండగడతామన్నారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ , తల్లికి వందనం పథకాలు అమలు చేయకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యారంగ సమస్యలతో పాటు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా మహాసభల పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దను, బాలాజీ, శివ, నవీన్, షెక్షావలి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, అన్ని ప్రజా సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

సర్వే యాప్‌లో నమోదు చేసుకోవాలి

పామిడి: మండలంలోని సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల వివరాలను గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా ప్రారంభమైన సర్వేయాప్‌లో నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ తేజోత్స్న సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ సర్వేలో నమోదైతే ప్రభుత్వపరంగా ఎంఎస్ఎంఈ ద్వారా పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహకాలు వర్తిస్తాయన్నారు. మండలంలోని వర్తక, వాణిజ్య సంఘాలు ఈ సర్వేకు గాను సచివాలయ సిబ్బందికి సహకరించాలన్నారు.

పెద్దవడుగూరులో ఎమ్మెల్యే పర్యటన

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో గురువారం తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తమకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి వచ్చారు. వెంటనే ఆయన అధికారులతో మాట్లాడారు. బస్సు సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటాని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం టీడీపీ కార్యాలయ నిర్మాణం కోసం స్థలం పరిశీలించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

గుంతకల్లు/పామిడి/యాడికి/ శింగనమల/ గార్లదిన్నె/ బుక్కరాయసముద్రం/ పుట్లూరు: రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం గుంతకల్లులోని ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులపై డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్లతోపాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ శుక్రవారం మండలంలోని కసాపురం, సంగాల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటే ప్రజలు అర్జీలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, టీడీపీ నాయకులు నారాయణ స్వామి, ఆనంద్, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, రమేష్‌రెడ్డి, ఓబులేసు, దశరథ, రాజకీయ నాయకుల పాల్గొన్నారు.

+ పామిడి మండలంలో శుక్రవారం జీ కొట్టాల, దేవరపల్లి గ్రామాల్లోనూ; 7న రామగిరి, అప్పాజీపేట గ్రామాలు, 10న ఎద్దులపల్లి, 11న సొరకాయలపేట, నెమళ్లపల్లి, 12న పొగరూరు, 13న రామరాజుపల్లి, కాలాపురం, 17న కండ్లపల్లి, వంకరాజుకాలువ, 18న కత్రిమల, పాళ్యం, 19న అనుంపల్లి, ఖాదర్‌పేట, 20న గజరాంపల్లి, నీలూరు, 21న అక్కజాంపల్లి, ఎదురూరు, 27, 28 తేదీల్లో పామిడిలో సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీధరమూర్తి తెలిపారు.

+ పెద్దవడుగూరు మండలంలో శుక్రవారం ఆవులాంపల్లి, విరుపాపురం. 7న కొండూరు నాగలాపురం, 10న జి.వెంకటాంపల్లి, 11న ముప్పాలగుత్తి, బుర్నాకుంట, 12న మేడిమాకులపల్లి, తెలికి, 13న చింతలచెరువు, 17న కోనాపురం. 18న క్రిష్టిపాడు, 19న మిడుతూరు, 20న గుత్తిఅనంతపురం , 21 న అప్పేచర్ల, 24న చిన్నవడుగూరు, 26న పెనకలపాడు, 27న దిమ్మగుడి, 28న కండ్లగూడూరులో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఉషారాణి తెలిపారు.

-యాడికిలో శుక్రవారం గుడిపాడు, 10న కుందనకోట, 12న రాయలచెరువు, 13న ఓబుళాపురం, 17న పుప్పాల, 19న తిమ్మాపురం, 20న తూట్రాళ్లపల్లి, 24న నగరూరు, 28న చందన, వచ్చే ఏడాది జనవరి 2న యాడికి,4న కోనుప్పలపాడు, 7న వేములపాడు, 8న కమలపాడులో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి తెలిపారు.

+ శింగనమల మండలంలో శుక్రవారం లోలూరు, 7న ఆకులేడు, 10న చెన్నవరం, పెద్ద జలాలపురం, 11న వెస్ట్ నరసాపురం, కర్నాటకంపల్లి, 12న నిదనవాడ, 13న రాచేపల్లి, 17న పెరవలి, 18న జూలకాల్వ, 19న బుడ్డేపల్లి, 20న సలకంచెరువు, 21న మట్లగొంది, 26న సోదనపల్లి, 27న ఆనందరావుపేట, 28న చీలేపల్లి, 31న కల్లుమడిలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు.


+ గార్లదిన్నె మండలంలో శుక్రవారం కోటంక, 7న కేశవాపురం, 10న మర్తాడు, 11న ఓబుళాపురం, జంబులదిన్నె, 12న కనంపల్లి, 13న కోటంక, 17న కల్లూరు, కల్లూరు అగ్రహారం, 18న బూదేడు, క్రిష్టాపురం, 19న గార్లదిన్నె, 20న ఇల్లూరు, 21న యర్రగుంట్ల, 24న పెనకచెర్ల, 25న ముంటిమడుగు, 26న అంకంపేట, 27న శిరివరం పంచాయతీల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఈరమ్మ తెలిపారు.

+ బుక్కరాయసముద్రం మండలంలో శుక్రవారం జంతలూరు, చెన్నంపల్లి, 10న చెదుల్ల, 11న కొర్రపాడు, 12న రోటరీపురం, 18న సిద్దంపేట, రెడ్డిపల్లి, 19న కేకే అగ్రహారం, వెంకటాపురం, 20న చెన్నంపల్లి, బొమ్మలాటపల్లి, 21న సిద్దరాంపురం, 24న దండువారిపల్లి, 26న గోవిందపల్లి, 27న పొడరాళ్ల, 28న బుక్కరాయసముద్రంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పుణ్యవతి తెలిపారు.

+ పుట్లూరు మండలంలో శుక్రవారం ఆరకటివేముల, కొండాపురం, 7న సూరేపల్లి, గొల్లపలి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శేషారెడ్డి తెలిపారు.

జనన ధ్రువీకరణ పత్రాల కోసం ఎదురుచూపు

- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రజల ప్రదక్షిణలు
- దరఖాస్తులపై రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం



ఆర్ఐ టేబుల్‌పై ఉన్న పెండింగ్ దరఖాస్తులు

తాడిపత్రి రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగిగా పని చేస్తున్నా.... అక్క పిల్లలకు సంబంధించిన జనన ధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశా.. 15 రోజులకు గానీ దరఖాస్తులపై వివిధ స్థాయిల్లో అధికారులు సంతకాలు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయలేదు. నా పరిస్థితే ఇలా ఉంటే పేదవారు, అమాయకులు, నిరక్షరాస్యులైన విద్యార్థుల తల్లిదండ్రుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చని ఒకఉద్యోగి సాక్షి విలేకరితో వాపోవడాన్ని చూస్తే తహసీల్దార్ కార్యాయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు ఏ స్థాయిలో నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థమవుతోంది. అపార్ నమోదు పేరుతో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుల్లో వివరాలు ఒకే విధంగా ఉండాలన్న నిబంధన పెట్టారు. చాల భాగం రెండింటిల్లో తేడాలు ఉంటున్నాయి. కొందరికి జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొంటున్నారు. వీటిని వీఆర్ఓ, ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ల సంతకాల తరువాత ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇదంతా జరగడానికి ఎన్ని రోజులు పడుతుందో బాధితులు ముట్టజెప్పే ముడుపులు, చోటా రాజకీయ నాయకుల సిఫారస్సులను బట్టి ఉంటుంది. జనన ధ్రువీకరణ సంతకాల కోసం రోజుల తరబడి పనులు వదిలిపెట్టి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కూలీలు, కార్మికులు ప్రదక్షిణలు చేస్తున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని వారి పరిస్థితి మరి ఘోరంగా ఉంటోంది. జనన ధ్రువీకరణ, అధార్‌లో మార్పులు చేర్పుల విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని అధికారులు, ఉద్యోగులను కలెక్టర్ హెచ్చరించినా తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఆయా టేబుళ్ల వద్ద సంతకాలు కానీ జనన ధ్రువీకరణ దరఖాస్తులే వారి పనితీరుకు అద్దం పడుతున్నాయి. ఇక్కడ సంతకాల తరువాత అప్‌లోడ్ చేసిన దరఖాస్తులు ఆర్డీఓ కార్యాయానికి వెళతాయి. అక్కడ సంతకాలు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే తప్ప జనన ధ్రువీకరణ పత్రాలు డౌన్ లోడ్ చేసుకునే అవకాశం లేదు. తహసీల్దార్ కార్యాలయంలో సంతకాలకే రోజులు పడుతుంటే అనంతపురం డివిజన్‌లో ఉండే మండలాల నుంచి వచ్చే వేలాది దరఖాస్తులపై సంతకాలు, ఆపై అప్‌లోడ్ చేయడానికి ఎన్ని పడుతుందో తెలియక బాధితులు ఆందోళన చెందుతున్నారు.

పనులు వదిలిపెట్టి తిరుగుతున్నా



పెద్దపొలమడ జెడ్పీ హైస్కూల్‌లో నా కుమారుడు 8వ తరగతి చదువుతున్నాడు. జనన ధ్రువీకరణ పత్రం కోసం మూడు రోజులుగా భార్య, కొడుకుతో కలసి తహసీల్దార్ కార్యాలం చుట్టూ తిరుగుతున్నా. ఫ్యాక్టరీలో బండలను పాలీసు పడుతూ ఉపాధి పొందుతున్నాం. జనన ధ్రువీకరణ కోసం పనులు వదిలిపెట్టి తిరుగుతున్నాం. ఇంకా ఎన్ని రోజులు పడుతుందో తెలియడం లేదు.

–రామాంజనేయులు, చిన్నపొలమడ

అప్‌లోడ్ చేయాలని ఆదేశించాం



జనన ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఉద్యోగులను ఆదేశించాం. ఇప్పటి వరకు 300 దరఖాస్తులను అప్‌లోడ్ చేశాం. ఇంకా 120 వరకు ఉన్నాయి. దరఖాస్తుదారులను ఇబ్బందులు పెట్టరాదని సిబ్బందిని హెచ్చరించాం. ఎవరూ ఆందోళన చెందొద్దు. అర్హులు అందరికీ జనన ధ్రువీకరణ ప్రత్రాలు అందజేస్తాం.

– రజాక్‌వలి, తహసీల్దార్

గ్రామ సదస్సులను విజయవంతం చేయాలి

తాడిపత్రి రూరల్: గ్రామ సదస్సులను విజయవంతం చేయాలని వీఆర్ఓలు, సర్వేయర్లను తహసీల్దార్ రజాక్‌వలి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. అధికారుల దృష్టికి వచ్చే ప్రతి సమస్యనూ రికార్డులో రాసుకోవాలన్నారు. సహనంతో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. నిర్లక్ష్య సమాధాలతో వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'అంబేడ్కర్ సర్కిల్‌గా నామకరణం చేయాలి'

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఉన్న స్థలాన్ని అంబేడ్కర్ సర్కిల్‌గా నామకరణం చేయాలని కుల వివక్ష వ్యవతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఓ నల్లప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం అంబేడ్కర్ పోరాడి అనేక చట్టాలను రూపొందించారన్నారు.